క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జేసీ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్, ఆర్వో లావణ్యవేణి

పెదపాడు: దెందులూరు అసెంబ్లీ నియోజక వర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి సోమవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూం వద్ద భద్రతను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి రోజు స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈవీఎంలకు తలుపులకు వేసిన తాళాలను, సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో జేసీ సంతకం చేశారు.

చెరువుల్లో మట్టి తవ్వితే కఠిన చర్యలు

- చెరువుల వద్ద సిబ్బంది ఏర్పాటు
- దెందులూరు మండల ఇరిగేషన్ ఏఈ కిషోర్

సాక్షి ఎఫెక్ట్

దెందులూరు: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా జేసీబీలతో తవ్వి, ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్న ఘటనలపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఇరిగేషన్, డివిజనల్ ఇంజనీర్ అర్జున్ సిబ్బంది పర్యవేక్షణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు మండల ఏఈని ఇరిగేషన్ చెరువుల్లో మట్టి తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చెరువుల్లో మట్టి తవ్వకాలకు రాష్ట్రంలో ఎక్కడా అనుమతులు లేవని, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో ఎవరు మట్టి తవ్వినా నేరమని ఆయన అన్నారు. అన్ని గ్రామాల్లో ఉన్న ఇరిగేషన్ చెరువుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఏ గ్రామంలోనైనా మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మట్టి తవ్వితే కఠిన చర్యలు ఉంటాయని ఏఈ కిషోర్ హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత



పెదవేగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ స్వరూపరాణి

పెదవేగి : శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి అన్నారు. పెదవేగి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించిన ఆమె స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు అనంతరం కూడా ప్రతి ఒక్కరూ ఇదే విధమైన సంయమనంతో వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె సూచించారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు సంబంధించిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చడం, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బందులు కలిగేలా సంబరాలు జరుపుకోవడం చేయరాదని ఆమె హితవు పలికారు. ఎటువంటి గొడవలు, వివాదాలకు తావులేని విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి, వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్వరూపరాణి హెచ్చరించారు. ఏఎస్పీ వెంట నూజివీడు డీఎస్పీ బి.లక్ష్మయ్య, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్, ఎస్సై బి.రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

శాంతిభద్రతలకు అందరూ సహకరించాలి

భీమడోలు: గ్రామాల్లో గొడవలకు ఆస్కారం లేకుండా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు తన వంతు సహాయ సహకారాలను అందించాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కౌంటింగ్, కోడ్ అమలులో భాగంగా నియమ నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సై వై.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జూన్ 6వ తేదీ వరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు ఉందని, తద్వారా గ్రామాల్లో 144 సెక్షన్ అమలవుతుందన్నారు గుంపులుగా జనం ఒకే చోట ఉండ వద్దన్నారు. కౌంటింగ్ రోజు అనవసరంగా రోడ్లపైకి వచ్చి అల్లర్లను సృష్టించవద్దన్నారు. గొడవలకు కారణమై క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవద్దని యువతకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల శాంతియుతంగా ఉండాలని, ముందస్తుగా అనుమతులు లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదన్నారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసులపై కమిషన్ ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, అన్ని కేసుల్లో శిక్ష పడేలా దర్యాప్తు బృందాలను నియమించామన్నారు.

బడి ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాల పంపిణీ

- నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి
- ఎంఈవో కార్యాలయాలకు, పాఠశాలలకు చేరిన పుస్తకాలు



పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

దెందులూరు : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి సంస్కరణవాది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ బడులను నాడు– నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేస్తున్నారు. యావత్తు దేశమంతా ఏపీలో అమలవుతున్న విద్యావిధానంపై దృష్టి సారించేలా, చర్చించుకునేలా, అనుకరించేలా రూపురేఖలు మార్చేశారు. గతంలో విద్యార్థులకు 3, 4 నెలల సమయం పాఠ్యపుస్తకాలు ఇవ్వడానికి పట్టేది. ఐదేళ్లుగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా తరగతి గదులు, భోజనంతో పాటు పుస్తకాల పంపిణీ చేస్తున్నారు. విద్యకు సంబంధించి అన్ని అంశాలు నూరు శాతం ఫలితాలు వచ్చేలా వివిధ పథకాలు అమలు చేయడం, వాటిని పర్యవేక్షించడం రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ప్రకటించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో సైతం బాధ్యత, అంకితభావం పెరిగింది. పాఠశాలలు పునః ప్రారంభం రోజునే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం



జిల్లా కలెక్టర్ ,డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇప్పటికే జాబితాలు పూర్తయ్యాయి. హెచ్‌ఎంలకు ఇప్పటికే ఎంఈఓ కార్యాలయాల నుండి పుస్తకాలు అందచేశాం.

– పీఎస్‌వీ ప్రసాద్, ఎంఈఓ, దెందులూరు

విద్యార్థులకు పూర్తిస్థాయిలో మేలు



బడి ప్రారంభంరోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం ఎంతో మేలు జరిగే అంశం. పాఠశాలలు ప్రారంభమైన ఒక నెల, 40రోజులవరకు పుస్తకాలులేకపోతే ఉపయోగంఉండదు. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల సబ్జెక్టులపరంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో మేలుజరుగుతుంది.

– జీఎస్ఎల్ఎస్‌వీ శర్మ, ప్రధానోపాధ్యాయుడు, కొవ్వలి పాఠశాల

దెందులూరు నియోజకవర్గంలో మండలాల వారీగా వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	53	4,553
పెదవేగి	67	6,946
పెదపాడు	56	4,640
ఏలూరు రూరల్	58	17,167
మొత్తం	234	31,306

జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గంలో అన్ని మండలాల ఎంఈఓ కార్యాలయాలకు పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వాటిని ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంకు భిన్నంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ విద్యార్థులకు ఆలస్యం కాకూడదని, పాఠశాలలు తెరిచిననాటి నుంచి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం దృఢనిశ్చయం. ఇందుకు అనుగుణంగా పర్యవేక్షణకు ఈ కార్యక్రమ అమలుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. కలెక్టర్, డీఈఓ, డీవైఈఓ, మండలాల ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు.

ప్రభుత్వ లక్ష్యాలు సాధించడమే కర్తవ్యంగా పని చేయాలి



దెందులూరులో మాసిక మహోత్సవ సభలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

దెందులూరు: దెందులూరులో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో సోమవారం మాసిక మహోత్సవంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. ఉద్యోగులు ఐసీడీఎస్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారని, లబ్ధిదారులు వీటి ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, నూతన శోభను సంతరించుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించమే ఏకైక కర్తవ్యంగా అంకితభావంతో ఉద్యోగులు సేవలందించాలన్నారు. మహోత్సవంలో అంగన్‌వాడీ చిన్నారులు, కిశోర బాలికలు తదితరులు ఉన్నారు.

ఉత్తరప్రదేశ్ నుంచి కన్యాకుమారి వరకు కాలినడక



దెందులూరు హైవే వద్ద మొక్క నాటుతున్న శివకరణ్‌సింగ్

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ, సనాతన హిందూ ధర్మం, సంస్కృతి పరిరక్షణకు అవగాహన కల్పించడం కోసం, దేశం వెలుపల రేయింబవళ్లు నిద్రాహారాలు మాని రక్షణగా ఉన్న సైనికుల కోసం జాతీయ ప్రచారకర్త శివకరణ్‌సింగ్ 13,800 కిలోమీటర్లు కాలికనడకన సోమవారం దెందులూరుకు విచ్చేశారు. ఆయనకు దెందులూరు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుగ్గిశెట్టి నూకరాజు, సిబ్బంది, దెందులూరు శ్రీరామదండు సభ్యులు ఘన స్వాగతం పలికారు. శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ నూకరాజు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ కోసం ఎందరో మహానుభావులు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ వారి అభీష్టానికి అనుగుణంగా పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. సైనికులు లేకపోతే దేశం వెలుపల కోట్లాది మంది ప్రజలకు రక్షణ కరువవుతుందన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం ధైర్యాన్ని నింపడం అమరవీరులకు నిజమైన నివాళిగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మధు, మిరపల రాజేష్, దేవినేని తులసిదాసు, హేమంత్, సప్పా శ్రీనివాసరావు, కొలుసు నాని, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మాతా రమాబాయి త్యాగం అందరికీ ఆదర్శం



మాతా రమాబాయి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మాతా రమాబాయి త్యాగం అందరికీ ఆదర్శనీయమని, మహిళా లోకానికి ఆమె స్ఫూర్తి అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. మాతా రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మాతా రమాబాయి చిత్రపటానికి దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సంతోష్ కుమార్ మాట్లాడారు. మహనీయుల కృషి ఫలితంగా నేటి మహిళలు రాష్ట్రంలో, దేశంలో ఉన్నత విద్యనభ్యసించడం, ఉద్యోగాలు చేయటం, స్వేచ్ఛగా జీవించడంతోపాటు పురుషులతో సమానంగా సర్వహక్కులు కలిగి ఉన్నారని అన్నారు. ఆనాడు రమాబాయి అహర్నిశలు శ్రమించి డబ్బులు కూడబెట్టి ఆమె భర్త బాబా సాహెబ్ అంబేడ్కర్ చదువుకు అందించడం వల్లే ఈ సమానత్వం సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద రాజ్యాంగం రాసి ఈ దేశానికి అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు, మానవ హక్కుల పరిరక్షకుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ విజయాల వెనుక రమాబాయి కృషి ఉందని గుర్తు చేశారు. కులమతాలతో సంబంధం లేకుండా స్త్రీలకు అన్ని హక్కులు కల్పించిన బాబా సాహెబ్ రాసిన రచనలను అందరూ చదవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో గారపాటి నాగేశ్వరరావు, కనికెళ్లి రవిప్రసాద్, కె.సురేష్ పాల్గొన్నారు.

బాలికా సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి రాజేష్

కొయ్యలగూడెం: బాలికా సంరక్షణ ధ్యేయంగా ఐసీడీఎస్ శాఖ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి పంతగాని రాజేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను నిరోధించడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బడిఈడు పిల్లలు బడిబాట పట్టే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం, పోలవరం మండలాలకు చెందిన కరోనా బాధిత కుటుంబాల వారితో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా కరోనా సమయంలో కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోయిన వారికి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం గురించి వివరించి, వారి చేత దరఖాస్తులను స్వీకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంబటి సరస్వతి, నయోమీరాణి పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి



భీమడోలులో కందుకూరి, నెహ్రూ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పిప్పర గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భీమడోలు: సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, మహిళా జనోద్ధారకుడు కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞానశిబిరంలో భాగంగా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు 105 వర్ధంతి, తొలి ప్రధాని నెహ్రూ 60వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సాంఘిక రుగ్మతలను రూపుమాపారని, పురుషులు, మహిళలు కలిసి చదువుకునేలా కృషి చేసిన మహనీయుడు కందుకూరి అని కొనియాడారు. భారత రాజకీయాల్లో శక్తివంతమైన నేత నెహ్రూ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, పండితుడు, రచయిత, చరిత్రకారుడని వివరించారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు వడ్లపట్ల ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచే వేసవి శిక్షణ శిబిరం

గణపవరం: విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బైర్రాజు ఫౌండేషన్ సభ్యులు సూచించారు. గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లు అందజేసి కంప్యూటర్ ఆపరేటింగ్, వివిధ రకాల యాప్‌ల నిర్వహణపై రిసోర్స్‌పర్సన్ దుర్గాప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మూడురోజులపాటు కొనసాగుతుందని గ్రంథపాలకుడు రంగారావు తెలిపారు. ప్రముఖ చిత్రకారుడు రాజు బత్తుల విద్యార్థులకు పెయింటింగ్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గుడ్ల వెంకటకృష్ణారావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంత్యుత్సవాలు ప్రారంభం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సుందరకాండ పారాయణ చేస్తున్న మహిళలు



అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో 23వ హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవతో అర్చకులు పూజా క్రతువులను ప్రారంభించారు. స్వామి వారికి అర్చన చేశారు. అనంతరం దాతల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. 1008 గులాబి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వెనుక భాగాన భజన కార్యక్రమం, హనుమాన్ జంక్షన్ సుందరకాండ పారాయణ ఏర్పాటు చేశారు. సాయంత్రం వెండి, బంగారు పుష్పాలతో స్వామికి ప్రత్యేక పూజ, నక్షత్ర హారతి అందించారు. జై హనుమాన్ భజన మండలి హనుమాన్ జంక్షన్ వారి కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి మిమిక్రీ, స్వాతి ఆర్కెస్ట్రా భీమవరం వారి మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పనులు.. అభివృద్ధికి బాటలు

- గ్రామాల్లో చురుగ్గా ఉపాధి పనులు
- 2024–25లో రూ.19.39 కోట్ల పనులకు ఆమోదం
- 7,13,118 పనిదినాలు, 565 పనులు పూర్తి



కొల్లేరులో కూలీలకు పనులు వివరిస్తున్న ఏపీఓ కిషోర్



గుడివాకలంకలో తాగునీటి చెరువు గట్లు పటిష్ట పరుస్తున్న కూలీలు



కొల్లేరు గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన రెండు నెలల్లో రూ.434.92 లక్షల పనులు పూర్తయ్యాయి. 9,195 మంది కూలీలకు అధికారులు పని కల్పించారు. 15 గ్రామ పంచాయతీల్లో మొత్తంగా కూలీలు అందరకూ కలిసి ఇప్పటి వరకూ 1,66,465 పని దినాలు పూర్తి చేశారు. మండల ఉపాధి పథకం అధికారులు 2024–2025 సంవత్సరంలో రూపొందించిన ప్రణాళిక మొదట దశలో భాగంగా ప్రభుత్వం రూ.19.39 కోట్ల పనులకు పచ్చజెండా ఊపింది. దీంతో అధికారులు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు చేపట్టారు.

ఉపాధితో పాటు అభివృద్ధి

ఈ ఏడాది చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కోమటిలంక, పెదయాగనమిల్లితో పాటు కలకుర్రు, శ్రీపర్రు, మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి, మల్కాపురం గ్రామా ల్లో ఉపాధి పనులు కొత్త పుంతలు తొక్కనున్నాయి. కూలీలు పూర్తి చేసిన పనులు అధారంగా ప్రభుత్వం సుమారు రూ.15 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో అందిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మొత్తంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని చెబుతున్నారు. గతేడాది ఇదే మాదిరిగా ప్రభుత్వం మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ.15.16 కోట్లు చేసిన సంగతి తెలిసిందే.

కూలీలందరికీ పని కల్పిస్తాం



మండలంలో ఉపాధి హామీ పథకంలో 8,849 కుటుంబాలకు జాబ్‌కార్డులు మంజూరు చేశాం. రూ.19.39 కోట్ల పనులకు ఆమోదం లభించింది. ఇప్పటికే ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 19 వరకూ రూ.434.92 లక్షలు కూలీలు వేతనాల రూపంలో అందుకున్నారు. మొత్తంగా ఈ ఏడాది కూలీలకు 7,13, 118 పనిదినాలు కల్పిస్తాం. కూలీలందరికీ చేతినిండా పని కల్పిస్తాం.

– కిషోర్, ఏపీఓ

అభివృద్ధి అందరికీ చేరుతుంది



ఉపాధి హామీ పథకం మా గ్రామంలో పని లేని పేదలకు వరం వంటిది. ఈ పథకంలో ప్రజలకు పని దొరకడంతో పాటు గ్రామానికి మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో పెద్ద ఎత్తున నిధులు రానుండడం సంతోషంగా ఉంది. అందుకే ఈ ఏడాది గ్రామ సభలు ఏర్పాటు చేసి, కూలీలకు అవసరమైన పనులు ప్రణాళికలో పెట్టాం. గ్రామంలో చెరువులు, కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడిక తీత పనులు పూర్తి చేస్తే బాగుంటుంది.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు సర్పంచ్

చేతినిండా పనులు

అధికారులు ప్రత్యేక చొరవ చూపడంతో ఈ ఏడాది కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. అధికారులు మొత్తంగా 565 పనులు రూపొందించారు. ఇందుకోసం గ్రామాల్లో పంట కాలువ, తాగునీటి చెరువులు, డ్రెయిన్లు పూడిక పనులు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. ఫలితంగా 7,13,118 పని దినాలు కూలీలకు అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల ఏడాదికి ఒక్కొక్క కూలీకి కనీసం 100రోజుల పని దొరుకుతుంది. రోజుకు రూ.265 వేతనం అందుకోవచ్చు. మొత్తంగా ఏడాదిలో 100 రోజులకు రూ. 26,500 కూలీల ఖాతాలో జమ కానున్నాయి.

వాలీబాల్‌తో కొట్టారంటూ ఫిర్యాదు

పెదవేగి : రోడ్డుపై వెళుతున్న తనను ముగ్గురు యువకులు వాలీబాల్‌తో కొట్టారని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై ఎం రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం వేగివాడలో ఈనెల 23న రోడ్డుపై వెళుతుండగా జాలాది సుధీర్, మరో ఇద్దరు యువకులు వాలీబాల్‌తో కొట్టారని బాధితుడు దాసరి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

వాలీబాల్ ఆడుకుంటున్న తమపై ఓ వ్యక్తి కులం పేరుతో దూషించాడని జాలాది సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 23న పెదవేగి మండలం వేగివాడలోని కొంతమంది యువకులు వాలీబాల్ ఆడుతున్న సమయంలో దాసరి రామకృష్ణ స్థానిక యువకులను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డీఎస్పీ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాసిక మహోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దళితవాడ ఎంపీపీ స్పెషల్ స్కూల్ నందు మాసిక మహోత్సవం–2024 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర బాలికలు, తల్లులకు ఋతుక్రమ సమయంలో ఉపయోగించే ఉత్పత్తులు, వాటిని పడవేసే విధానాల గురించి అవగాహన కల్పించారు. ఋతుక్రమ సమయంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, అత్యవసర సమయంలో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి అవగాహన కల్పించారు.